క్లుప్తంగా

రైతులకు ఇబ్బందులు లేకుండా రీసర్వే చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్ అరుణకుమారి, డీటీ స్వరూపారాణి

పాలసముద్రం: గ్రామాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా రీ సర్వే చేయాలని తహశీల్దార్ అరుణ కుమారి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ స్వరూపారాణి ఆదేశించారు. వారు సోమవారం సిబ్బందితో సమీక్షించారు. వారు మాట్లాడుతూ విలేజ్ సర్వేయర్, వీఆర్‌ఓ గ్రామాల్లో పంటలు సాగు చేస్తున్న రైతుల రికార్డులను పరిశీలించాలన్నారు. అనంతరం సాగు చేస్తున్న భూములను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సరిహద్దులో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ తహశీల్దార్ రిషీవర్మ, ఏఆర్‌ఐ దేవి, వీఆర్‌ఓ తంగరాజ్, రమేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈఓ గిరిజ

పాలసముద్రం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈఓ గిరిజ ఆదేశించారు. ఆమె సోమవారం ఎమ్మార్సీలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ బియ్యాన్ని రెండుసార్లు మంచి నీటితో కడిగిన తర్వాతే వండాలన్నారు. సాంబారు, రసానికి తాజా కూరగాయలు వాడాలని సూచించారు. వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు శరవణన్, మునిరాజ్, రాజేశ్వరి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి మహాభారత ఉత్సవాలు

వెదురుకుప్పం: చెంచుగుడి గ్రామ సమీపంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజు ల ఆలయంలో 6వ తేదీ నుంచి మహా భారత ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 5న ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పది రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లను ఘనంగా చేపడుతున్నట్టు వివరించారు.

గత పాలనతోనే.. ఆలయాలకు వైభవం

- రూ.2.40 కోట్లతో పెనుమూరులో వేంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం
- గత ప్రభుత్వ హయాంలోనే శతాబ్దాల నాటి ఆలయాలకు పునర్వైభవం
- నేడు జీడీనెల్లూరులోని ఆలయాల్లో టీటీడీ అధ్వర్యంలో పూజలు, నిత్యకైంకర్యాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు





ప్రస్తుతం వరద వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారికి కల్యాణోత్సవం

కార్వేటినగరం: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పురాతన ఆలయాల అభివృద్ధికి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషిపై ప్రస్తుతం గ్రామీణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో శతాబ్దాల కాలం నాటి పురాతన ఆలయాలకు జీవం పోశారు. ఆరు మండలాల్లో నాడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న కళత్తూరు నారాయణస్వామి చొరవతో టీటీడీ, ఎండోమెంట్ ఆధ్వర్యంలో కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి ఆలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. నియోజకవర్గానికే తలమానికంగా నిలుస్తున్న కలిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.2.40 కోట్లు టీటీడీ ద్వారా నిధులు మంజూరు చేయించి ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేశారు. నాటి నుంచి ఆలయంలో టీటీడీ ద్వారా నిత్యం ధూపదీప నైవేద్యాలు జరుగుతున్నాయి. అలాగే కార్వేటినగరం మండలం అళత్తూరు గ్రామంలో 4 శతాబ్దాల క్రితం నిర్మితమైన వరద వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని గత ప్రభుత్వ హయాంలోనే టీటీడీకి అనుసంధానం చేసి రూ.2.40 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశారు. నేడు టీటీడీ అర్చకులు విధులు నిర్వహిస్తూ ఆలయంలో ధూపదీప నైవేద్యాలు, నిత్యకైంకర్యాలు జరుగుతున్నాయి. అలాగే కొటార్వేడు గ్రామంలో అగస్త్రీశ్వరస్వామి ఆలయాన్ని రూ.2.75 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్‌తో, పాలసముద్రం మండలం మఠవలంలో పురాతనమైన గోవర్ధనేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టారు. అదేవిధంగా శ్రీరంగరాజపురం మండలం ఆరిమాకులపల్లిలో వెలసిన ఆరిమాని గంగమ్మ ఆలయ పునర్నిర్మాణానికి, టీటీడీ ఆధ్వర్యంలో రూ.10 లక్షల చొప్పున 87 ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

ఇది కలా.. నిజమా



శతాబ్దాల కాలం క్రితం నిర్మించిన కలికిరి వేంకటేశ్వర స్వామి పురాతన ఆలయానికి పూర్వ వైభవం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. రూ.2.40 కోట్లు వెచ్చించి పునర్నిర్మాణం చేయడమే కాకుండా టీటీడీతో అనుసంధానం చేసి నిత్యం ధూపదీప నైవేద్యాలతో పాటు నిత్యకైంకర్యాలు చేపట్టడంతో ఇది కలా నిజమా అన్నట్లుంది. కలికిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చిన గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వానికి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– విజయకుమార్‌రెడ్డి, మండల కన్వీనర్, పెనుమూరు

ఇచ్చిన మాట ప్రకారం..



కొన్నేళ్లుగా ధూపదీప నైవేద్యానికి కరువైన పురాతన ఆలయం కలికిరి వేంటేశ్వర స్వామి ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసి, నిత్యం పూజా కార్యక్రమాలు జరిగేలా చేసిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. 2019 ఎన్నికల్లో మా గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేసిన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి సహకారం మరువలేనిది.

–కమలాకర్‌రెడ్డి, సీ.రామాపురం, పెనుమూరు మండలం

మా అదృష్టం ఇది..



ప్రపంచ దేశాల్లో పుణ్యక్షేత్రంగా పేరొందిన తిరుమల–తిరుపతి దేవస్థానం నుంచి టీటీడీ వాహనాలు, టీటీడీ ఉన్నతాధికారులు కలికిరి వేంకటేశ్వరస్వామి ఆలయానికి రావడం మా ప్రజలు ఎంతో అదృష్టవంతులు. ఆలయంలో జరిగే పూజలతో పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని సంతోషంగా ఉంది. ఆలయ పునర్నిర్మాణానికి నాడు సహకరించిన మాజీ సీఎం జగన్‌కు, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కృషి మరువలేనిది.

–దూదిమోహన్, రాచరంగయ్యపల్లి, పెనుమూరు మండలం

వైభవంగా మాతమ్మ తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో మాతమ్మవారు

నగరి: మున్సిపల్ పరిధిలోని కాకవేడు ఆదిఆంధ్ర వాడలో సోమవారం మాతమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి విగ్రహాన్ని పట్టు చీరలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగించగా భక్తులు కర్పూర హారతులు ఇచ్చి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

మండల సమావేశానికి అధికారుల డుమ్మా

శ్రీరంగరాజపురం: మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టడంపై పలువురు ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో పలువురు అధికారులు హాజరుకాకపోవడంపై ఎంపీపీ సరిత మండిపడ్డారు. వారికి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓ మోహన్‌మురళీని ఆదేశించారు. ఎంపీపీ సరిత మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండల స్థాయి అధికారులు సమావేశానికి రాకపోవడం తగదన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులుకు అందించాలన్నారు. గతంలో కంటే ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనాలు తక్కువ వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఈఓపీఆర్‌డీ కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా జలాశయం వస్తువుల తరలింపు





జలాశయం వస్తువులను ట్రాక్టర్‌లో తరలిస్తున్న కూటమి నాయకులు, కుప్ప కూలిన రేకుల షెడ్డు

- రూ.కోట్లలో దోపిడీ చేస్తున్న కూటమి నాయకులు
- పట్టించుకోని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని దర్జాగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రజా ధనాన్ని యథేచ్ఛగా స్వాహా చేస్తున్నారు. ఇసుక, గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా వారి కన్ను గంగాధరనెల్లూరు నియోజవర్గంలో వున్న కృష్ణాపురం జలాశయంపై పడింది. జలాశయానికి సంబంధించి తుప్పుపట్టిన వస్తువులకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండడంతో పట్టపగలే తరలించి విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. జలాశయానికి ఇరు పక్కలా ఉన్న కుడి, ఎడమ కాలువల పనుల్లో నాణ్యత లేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. అలాగే జలాశయం వద్ద ఇటీవల కొన్ని విలువైన వస్తువులు మాయమవుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇనుప వస్తువులను ట్రాక్టర్ ద్వారా తిరుపతికి తరలించి సొమ్ము చేసుకుంటున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా కృష్ణాపురం జలాశయం వద్ద ఇటీవల ఆధునీకరణ పేరుతో షెడ్లు నిర్మించారు. కొన్నాళ్ల క్రితం వీచిన తేలిక పాటి గాలులకే షెడ్లకు వేసిన రేకులు ఎగిరిపోయాయి. తద్వారా రూ.లక్షల ప్రజాధనం వృథా అయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్తమ విద్యాబోధనే ధ్యేయం



ఎంపీఎస్ హెచ్‌ఎంలకు ఆర్డర్ కాపీలు అందజేస్తున్న ఎంఈవో విజయకుమార్

కార్వేటినగరం: ఉత్తమ విద్యాబోధనే ధ్యేయంగా ఉపాధ్యాయులు పని చేయాలని ఎంఈవో ఎం.విజయకుమార్ తెలిపారు. ఆయన సోమవారం వివిధ పాఠశాలల నుంచి మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎంలుగా బాధ్యతలు చేపట్టిన వారికి ఆర్డర్ కాపీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిత్యం విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన ఉండాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో– 2 మనోజ్‌కుమార్, ఎంపీఎస్ హెచ్‌ఎం వెంకటేష్, శివశంకర్, మురగేశన్, ఉపాధ్యాయులు యువరాజు, సర్దార్, నాగేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల నైపుణ్యంతో ఉన్నత శిఖరాలు



విద్యార్థులకు సూచనలిస్తున్న ఐఆర్‌ఎస్ యాదగిరి

నగరి: ఆంగ్లంలో నైపుణ్యంతో ఉన్నత శిఖరాలు తథ్యమని పినాకా ట్రస్టు అధినేత ఐఆర్‌ఎస్ యాదగిరి అన్నారు. పినాకా ప్రజాసాధికార ట్రస్టు ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని పుదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు నైపుణ్యాన్ని ఎలా పెంచుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు ఆంగ్ల నైపుణ్యం తప్పనిసరన్నారు. ప్రస్తుతం ఉద్యోగ ఇంటర్వ్యూలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారని, అందులో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. దీనికి ఆంగ్లంలో నైపుణ్యం పెంచుకోవడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నమశ్శివాయం, కోర్సు డైరెక్టర్ మునస్వామి, ఫ్యాకల్టీ రవిశంకర్, మధుసూదన్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా తులసీరామ్

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి తహశీల్దార్‌గా తులసీరామ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ చేశారు. డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న తులసీరామ్‌కు ఇన్‌చార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు.

వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ





వెన్నుపోటు దినం నిర్వహణకు అనుమతులకు డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు, ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నగరి: అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చక పోవడంపై ఈ నెల 4వ తేదీన నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మాజీ మంత్రి ఆర్కే రోజా నివాస కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అనే జిమ్మిక్కులు చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అయితే ఏడాది అవుతున్నా ప్రభుత్వం ఏ హామీ నెరవేర్చక ప్రజలకు వెన్నుపోటు పొడిచిందన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన రోజును వెన్నుపోటు దినంగా నిర్వహిస్తున్నామన్నారు. చంద్రబాబు నాయుడుకు ఎన్నికల ముందు ఒక మాట.. ఎన్నికల తర్వాత ఒక మాట చెప్పడం అలవాటే అన్నారు. ఏడాది పాలనలో ప్రజలకు ఉపయోగపడే సచివాలయాలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. ఏ హాస్పిటల్లోనూ ఆరోగ్యశ్రీ అమలు కావడం లేదన్నారు. రేషన్ డోర్ డెలివరీ విధానానికి స్వస్తి పలికారన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయడం దారుణమన్నారు. ఉచిత బస్సు, అమ్మకి వందనం, ఆడబిడ్డల నిధి అంటూ ప్రజలను మోసం చేశారని తెలిపారు. వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించి అందరికీ అందజేశారు. అనంతరం 4వ తేదీ నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి అనుమతులు కోరుతూ ఆర్డీఓ భవానీ శంకరి, పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ మున్సిపల్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బీడీ భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, పార్టీ జిల్లా కమిటీ, మున్సిపల్, మండల కమిటీ, అనుబంధ కమిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ

గంగాధరనెల్లూరు: తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేయడంపై ఈ నెల 4వ తేదీన వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేఆర్ వెంకటరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం నాయకులతో కలిసి జీడీనెల్లూరులోని వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు మునిరాజారెడ్డి, గుణశేఖర్ రెడ్డి, చిన్నమరెడ్డి, సురేంద్ర రెడ్డి, యువత అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, ఏకాంబరం, గోవింద రెడ్డి, వేలు మొదలి, వెంకటేష్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, వేల్కూరు కుట్టి, ఢిల్లీ కుమార్, జగదీష్ బాబు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన చేపడుతున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక నాయకులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వెన్నుపోటు దినానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభా, సర్పంచ్ బాబురెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి అనిల్, మండల కన్వీనర్ వేణురాజు, మండల నాయకులు మునికృష్ణరెడ్డి, మునిరాజ్, గోపి, రమేష్, ఎయుమలైఆచారి, వీరయ్య, కై లాసం తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ

వెదురుకుప్పం: తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం నాయకులతో కలిసి వెదురుకుప్పంలో వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రజలకిచ్చిన హామీలను ఏనాడూ అమలు చేయలేదన్నారు. జెడ్పీటీసీ సుకుమార్ మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలుచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, వైద్య విభాగం గంగాధరనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, మండల ఉపాధ్యక్షుడు గోవిందన్, కార్యదర్శి బొజ్జారెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, మాజీ ఎంపీటీసీ బాబు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మునికృష్ణా రెడ్డి, పరంధామరెడ్డి, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి, యువ నాయకుడు పురందర్ రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణ

పుత్తూరు: వెన్నుపోటు దినం పోస్టర్లను సోమవారం పుత్తూరులో మున్సిపల్ చైర్మన్ ఎ.హరి వైఎస్ఆర్ సీపీ శ్రేణులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి, గద్దెనెక్కిన చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహావేశాలతో ఉన్నారన్నారు. ప్రజల పక్షాన జూన్ 4వ తేదీన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడానికి వైఎస్ఆర్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారని తెలిపారు. మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో బుధవారం నగరి పట్టణంలో చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రజలతో పాటు వైఎస్ఆర్ సీపీ శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: తప్పుడు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాది కావస్తున్నా ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నందుకు నిరసనగా 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు పిలుపునిచ్చారు. ఆయన సోమవారం కార్వేటినగరంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అధికారం, స్వప్రయోజనాల కోసం ప్రజలను వెన్నుపోటు పొడవడం సీఎం చంద్రబాబు నైజమన్నారు. సర్పంచ్ ధనుంజయవర్మ మాట్లాడుతూ వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయాలని కోరారు. మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం కొత్తపల్లి మిట్ట నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం కార్యదర్శి చందురాజు, ముస్లిం యువనాయకుడు తౌఫిక్‌ఖాన్, మున్నా, ప్రభాకర్‌రెడ్డి, శేషాద్రి, ధనశేఖర్‌యాదవ్, హమీద్, రత్నంరెడ్డి, కట్టా రవి, నందగోపాల్ నాగేంద్ర, దాము, రాజా, పవన్‌కుమార్, మురళీకృష్ణారెడ్డి, పయణిరెడ్డి, శివప్రకాష్ మొదలియార్, మురళీ, ధనశేఖర్, మదన్‌కుమార్‌రెడ్డి, దేశయ్య, వెంకటస్వామి, ఆశీర్వాదం పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం: మండల కేంద్రంలోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో సోమవారం వెన్నుపోటు దినం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ శివరాజు మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.



గంగాధరనెల్లూరు: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



నగరి: వెన్నుపోటు దినం పోస్టర్లు విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్



వెదురుకుప్పం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న మండల నాయకులు



కార్వేటినగరం: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పుత్తూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు



విజయపురంలో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

రేషన్ సరుకుల కోసం తప్పని తిప్పలు





రేషన్ సరుకుల కోసం వేచి ఉన్న వృద్ధురాలు, రేషన్ సరుకుల కోసం నిలవ లేక కూర్చుని ఉన్న లబ్ధిదారులు

పాలసముద్రం: ఇంటి వద్దకే రేషన్ పంపిణీని రద్దు చేసిన కూటమి ప్రభుత్వం పాత పంపిణీ పద్ధతిని అమలుచేయడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. సర్వర్ మొరాయించడంతో గంటల తరబడి లబ్ధిదారులు వేచి ఉండాల్సి వస్తోంది. పాలసముద్రం, నరసింహపురంలో లబ్ధిదారులు చంటి పిల్లలతో రేషన్ షాపులో మధ్యాహ్నం వరకు వేచివున్నా బియ్యం అందలేదు.

బ్రాహ్మణ సంఘం అధికార ప్రతినిధిగా బాలాజీ శర్మ



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

నగరి: తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి అధికార ప్రతినిధిగా పుత్తూరుకు చెందిన బాలాజీ శర్మ నియమితులయ్యారు. సోమవారం బ్రాహ్మణ సంఘ ఆవిర్భావ దినోత్సవం శ్రీకాళహస్తి బ్రాహ్మణ భవనంలో వేడుకగా జరిగింది. చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి, పుత్తూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట, తాటితోపు తదితర బ్రాహ్మణ సంఘాలు అన్నిటిని కలుపుతూ బ్రాహ్మణులంతా ఐక్యంగా ఒక తాటి మీదకు రావాలనే సంకల్పంతో రాష్ట్ర యువజన అధ్యక్షుడు, తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి ప్రధాన కార్యదర్శి శ్రీవేదం హరిప్రసాద్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా బాలాజీ శర్మ, సంయుక్త కార్యదర్శిగా బాలాజీ రావు, మహిళా విభాగం నుంచి టీకే లలిత, కలంచేరీ గీతలను నియమించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, క్రమశిక్షణ మండలి అధ్యక్షుడు కొత్తపల్లి అజయ్‌కుమార్, శ్రీకాళహస్తి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రకాశం, పుత్తూరు బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు ఆలూరు రామకృష్ణ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.